బీజేపీకి బండపల్లి సతీష్ గుడ్‌బై



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. సీనియర్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండపల్లి సతీష్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షులు, కిషన్‌రెడ్డికి పంపారు. బీజేపీ నాయకత్వ వ్యవహార శైలిపై అసంతృప్తితోనే తాను పార్టీని వీడుతున్నానని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గం ప్రజలకు సేవ చేసేందుకు, తనను నమ్ముకున్న కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

బాంబు పేలాలి.. ఓట్లు రాలాలి



దీపావళి సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి బాణాసంచా కాల్చారు. దీపావళి వేడుకలో పాల్గొనేందుకు అక్కడికి వచ్చిన వారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. -సనత్‌నగర్



గులాబీలో గ్రూపుల లొల్లి!

కంటోన్మెంట్‌లో ముచ్చటగా మూడో ఇన్‌చార్జ్
- ఇప్పటికే శ్రీనివాస యాదవ్, గజ్జెల నాగేశ్
- తాజాగా రంగంలోకి ఎమ్మెన్ శ్రీనివాస్

కంటోన్మెంట్: గ్రూపు తగాదాలతో సతమతమవుతున్న కంటోన్మెంట్ బీఆర్‌ఎస్‌కు మరో ఎన్నికల ఇన్‌చార్జ్ నియమితులయ్యారు. గత నెలలోనే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించగా, రెండు వారాల క్రితం గజ్జెల నాగేశ్‌ను సైతం ఇన్‌చార్జ్‌గా పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. అయినా వివిధ వార్డుల పరిధిలోని గ్రూపు తగాదాలు కొలిక్కి రాకపోవడంతో తాజాగా ముషీరాబాద్‌కు చెందిన సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌కు నియోజకవర్గ బీఆర్‌ఎస్ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన నియామకాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందిత ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అనధికారిక ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడంటూ పలువురు పార్టీ నేతలు ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండో వార్డుకు సంబంధించిన ఓ కీలక నేత తీవ్రంగా మనస్తాపానికి గురికావడంతో పాటు లాస్య వద్ద తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బోర్డు మాజీ సభ్యుల మితిమీరిన ఆధిపత్యంపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎట్టకేలకు మంత్రి బుజ్జగింపులతో తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ, పూర్తిస్థాయిలో అసంతృప్తికి అడ్డుకట్ట వేయక తప్పదని అధిష్ఠానం భావిస్తోంది. పరిస్థితి చేయి దాటక ముందే సరిదిద్దాలనే ఆలోచనలోనే మరో తటస్థ నేతను ఇక్కడకు ఇన్‌చార్జ్‌గా పంపినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పార్టీలో చేరికలు..

కంటోన్మెంట్‌కు చెందిన పలువురు మైనార్టీ నేతలు, కార్యకర్తలు పార్టీ నేత ఎమ్మెన్ శ్రీనివాస్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సిరాజ్‌తో పాటు పలువురు కార్యకర్తలకు ఎమ్మెన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, నర్సింహ ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, నరేశ్, శ్రీనివాస్, ఆంజనేయులు, దేవులపల్లి శ్రీనివాస్, జిలానీ, నర్సింహ, నాగరాజు, ప్రకాశ్, పొన్నాల బాబు, జహంగీర్ అజ్జు, నిహాల్ అహ్మద్, అబ్దుల్ వాహబ్, సలీం ఖాన్, మహ్మద్ జావీద్, సయ్యద్ ఆసిఫ్ పాల్గొన్నారు.



ఎమ్మెన్ శ్రీనివాస్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన సిరాజ్, ఇతర మైనార్టీ నేతలు

ఎంతో అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రత్యేక రాష్ట్రంపై ఉన్న అనుమానాలన్నీ తొలగిపోయాయని బీఆర్‌ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి తలసాని శ్రీవాస్‌యాదవ్ పేర్కొన్నారు. జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత, పనితీరుకు నిదర్శనమన్నారు. 2014కు ముందు నగరంలో తరచూ కర్ఫ్యూ, వివిధ రకాల ఇబ్బందులను నగరవాసులు ఎదుర్కొనే వారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే నగరంలో నూతన ఫ్లైఓవర్లు, రోడ్ల అభివృద్ధి, ఫుట్‌పాత్‌ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టి విశ్వనగరంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రానున్న 50 ఏళ్ల వరకు కూడా నగర ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా కృష్ణా, గోదావరి జలాలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. నగరంలో బోనాలు, బతుకమ్మ, గణేష్ నవరాత్రుల వంటి పండుగల నిర్వహణ, ఏర్పాట్లలో ముందుండేది తానేననే విషయం అందరికీ తెలుసన్నారు. తనకన్నా ముందు 50 సంవత్సరాల పాటు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎంతోమంది ప్రాతినిథ్యం వహించారని, ఉన్నతమైన పదవులలో ఉండి కూడా చేయలేని అనేక అభివృద్ధి పనులను తాము వచ్చిన తర్వాతనే చేయడం జరిగిందన్నారు.

2014 తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పార్టీ మారిన విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అన్నారు. జెక్‌కాలనీ వాసులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే అధికారులతో కలిసి వచ్చి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని మరోసారి ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జెక్‌కాలనీ ప్రతినిధులు రాఘవయ్య, శ్రీహరి, సుబ్బరాజు, సురేష్ చౌదరి, విశ్వనాథరాజు, అనంతరెడ్డి, మల్లారెడ్డి, సురేష్‌గౌడ్, బాషా, సుమ, రమ, నాగమణి, అమరావతి పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

కాంగ్రెస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి



వెన్నెలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ప్రొ. కోదండరామ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల గెలిపించాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొ. కోదండరామ్ అన్నారు. వెన్నెలతో కలిసి నాలుగో వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం కోసం జీవితాంతం పోరాటం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ కుమార్తె వెన్నెల సైతం ఆయన మార్గంలోనే పేదల కోసం పనిచేస్తుందన్నారు. బస్తీలు అధిక సంఖ్యలో ఉన్న కంటోన్మెంట్ ప్రజలకు గతంలోనూ కాంగ్రెస్ పాలనలోనే మేలు జరిగిందన్నారు. ఈ ప్రచారంలో బద్దం బల్వంత్ రెడ్డి, బద్రీనాథ్ యాదవ్, దుడ్డు సత్యనారాయణ, దుడ్డు సంజీవరావు నాగిరెడ్డి శ్రీరామానంద్ పాల్గొన్నారు.

బీసీని సీఎం చేస్తామన్న బీజేపీని ఆదరించండి



ప్రచారం చేస్తున్న అభ్యర్థి మేకల సారంగపాణి

లాలాపేట: సికింద్రాబాద్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి సోమవారం తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బీసీని సీఎం చేస్తానని ప్రకటించిన బీజేపీని ప్రజలందరూ ఆదరించాలన్నారు. తెలంగాణలో సమర్థవంతమైన డబుల్ ఇంజిన్ సర్కారు కోసం కమలం గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రచారంలో గండికోట నర్సింహా, రాముపర్మ, శారదా మల్లేష్, పోచయ్య యాదవ్, అంజి, మేకల హర్ష, అయ్యప్పరెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

'పాస్టర్లు, క్రైస్తవ సమాజాన్ని మోసం చేసిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న క్రైస్తవ సంఘాల నాయకులు

రాంగోపాల్‌పేట్: ఆల్ పార్టీ క్రిస్టియన్ డిక్లరేషన్ సమావేశమని చెప్పి క్రైస్తవులను రప్పించి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా డిక్లరేషన్ చేసి ఆ పార్టీ క్రైస్తవులు, పాస్టర్లను మోసం చేసిందని భారత క్రిష్టియన్ కౌన్సిల్ బిషప్ ముల్కల భాస్కర్, క్రిష్టియన్ పొలిటికల్ ఫ్రంట్ జెరుషలేం మత్తయ్య ఆరోపించారు. సోమవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిష్టియన్ జేఏసీ ప్రతినిధి కరుణాకర్, తెంలగాణ బిషప్స్ ఫెడరేషన్ ప్రతినిధి బిషప్ స్వామిదాస్‌తో కలిసి మాట్లాడారు. సోమవారం క్లాసిక్ గార్డెన్‌లో అన్ని పార్టీలతో క్రైస్తవుల డిక్లరేషన్ ఉంటుందని పాస్టర్లు, క్రైస్తవులకు సమాచారం అందించారని కానీ ఇక్కడకు వచ్చాక కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా అంటూ డిక్లరేషన్ విడుదల చేయించడం క్రైస్తవ సమాజాన్ని మోసం చేయడమేనని అన్నారు. రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో కొంతమంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు క్రైస్తవులను తప్పుదారి పట్టించేలా పాస్టర్లను పిలిపించి మోసం చేశారన్నారు. పదేళ్లలో క్రైస్తవులకు చెందిన ఒక్క సమస్య గురించి మాట్లాడని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తప్పుడు వాగ్దానాలతో ప్రజలను వంచించేందుకు యత్నిస్తుందని విమర్శించారు. త్వరలో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో క్రైస్తవులతో భారీ సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడతామన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే బీజేపీ లక్ష్యం



కూన వెంకటేష్‌గౌడ్‌ను ఓటు అభ్యర్థిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: అన్ని వర్గాల అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేసిన తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన తాను నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, బీజేపీ నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించడం ద్వారా నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా అన్నారు. తాను ఢిల్లీ స్థాయిలో ఎన్ని పదవులు చేపట్టినా ఆ పదవులకు న్యాయం చేస్తూనే నిరంతరం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ముఖ్యంగా భావించానన్నారు. నియోజకవర్గంపై పూర్తిస్థాయి అవగాహన ఉన్న తనను గెలిపించడం ద్వారా ఏ సమస్యనైనా సాంకేతిక నిపుణులతో చర్చించి శాశ్వతంగా పరిష్కరిస్తానన్నారు. సీనియర్ నేత కూన వెంకటేష్‌గౌడ్‌ను కలిసిన మర్రి శశిధర్‌రెడ్డి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ప్రచారంలో రాజలక్ష్మి ఆనంద్, విజయ్‌కుమార్, మిథున్, శ్రవణ్, నాని, మహేష్, పాండ్యన్, సంధ్యలక్ష్మీ, సంతోష్, రాంచందర్, స్వామి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలి



పురస్కారాన్ని అందుకుంటున్న డా. భాస్కరరావు

లక్డీకాపూల్: ఆత్మవిశ్వాసం, పోటీతత్వాన్ని పెంపొందించుకుని లక్ష్యం వైపు అడుగులు వేయాలని కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బి. భాస్కర్‌రావు అన్నారు. సోమవారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో జరిగిన విజయ్ ఆర్ట్స్ అకాడమీ-2023 అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని, ముఖ్యంగా క్రమశిక్షణ అంకితభావంతో ప్రయత్నిస్తే సాధ్యమన్నారు. ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయ్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే కళలపై ఆసక్తి కలిగించేలా ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఏటా విద్యార్థులకు నిర్వహించే పెయింటింగ్, కార్టూన్, వ్యాసరచన పోటీలలో భాగంగానే ఈ ఏడాది ఏర్పాటు చేసిన పోటీల్లో 20 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సినీ సంగీత దర్శకులు ఆర్.పి. పట్నాయక్, ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. లక్ష్మినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావుకు అకాడమీ విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు.

అట్టహాసంగా ముగిసిన ఓపెన్ టెన్నిస్ టోర్నీ



ట్రోఫీలతో విజేతలు

సాక్షి, సిటీబ్యూరో: మూడ్రోజుల పాటు ఉత్కంఠగా సాగిన 15వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం సికింద్రాబాద్ క్లబ్‌లో అట్టహాసంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 300లకు పైగా క్రీడాకారులు పోటీపడిన టోర్నమెంట్‌లో పురుషుల డబుల్స్ (30 ప్లస్) విజేతగా అనురుధ్, సిద్దార్థ్ జోడీ నిలిచింది. టైటిల్ పోరులో విజయానంద్, కన్నన్‌లపై 10-8తో గెలుపొందిన అనురుధ్, సిద్దార్థ్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. 30 ప్లస్ సింగిల్స్‌లో మంజునాథ్‌పై కన్నన్ 10-9 (7-4)తో గెలిచి టైటిల్ సాధించాడు. 40 ప్లస్ డబుల్స్‌లో ఎల్. శ్రీనివాస్, వాహీద్‌లు 10-7తో బోస్ కిరణ్, అఫ్రోజ్‌లపై నెగ్గగా.. సింగిల్స్‌లో అఫ్రోజ్ 10-3తో రజాపై గెలుపొంది విజేతగా నిలిచారు. 50 ప్లస్ డబుల్స్‌లో మణికందన్, కేవీఎస్ మూర్తి జోడీ 10-2తో నంద్యాల నర్సింహారెడ్డి, నీల్‌కాంత్‌లపై గెలుపొందారు. సింగిల్స్‌లో నీల్‌కాంత్ 10-0తో మణికందన్‌పై ఏకపక్ష విజయం నమోదు చేశారు. మెహర్ ప్రకాశ్, అంకయ్యలు వరుసగా 60, 70 ప్లస్ సింగిల్స్‌లో విజేతగా నిలువగా, డబుల్స్‌లో ఆనంద్ స్వరూప్, శ్రీనివాస్, అంకయ్య, గజపతి జోడీలు చాంపియన్లుగా నిలిచాయి. నార్త్ జోన్ ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, మిస్ ఆసియా రష్మి ఠాగూర్, తుమటి వెంకట నరసింహారెడ్డి, హెచ్‌టీఏ అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

లాలాపేట: హైదరాబాద్ నాంపల్లిలోని బజార్ ఘాట్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాద బాధితులను రాష్ట్ర ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఘోర అగ్నిప్రమాదం జరుగడం బాధాకరమని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడ్డ వారందరికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

బీరప్ప ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో కేశవరెడ్డి, శ్రీగణేష్

రసూల్‌పురా: అమావాస్య సందర్భంగా కంటోన్మెంట్ రసూల్‌పురా బీరప్ప ఆలయం, ఉషా గోదాం వద్ద సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, బీజేపీ అభ్యర్థి శ్రీగణేష్ పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జంగిల్‌రాజు, నాగరాజు, అశోక్, మణికంఠ, శరత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్ మృతి



శీలం ప్రభాకర్(ఫైల్)

రాంగోపాల్‌పేట్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ టీపీసీసీ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్ సోమవారం కన్నుమూశారు. ఈ నెల 7న ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన సికింద్రాబాద్‌లోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించారు. ఆయనకు భార్య కవిత, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ప్రభాకర్ తండ్రి శీలం రాందాస్ 1978 నుంచి 1983 వరకు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. శీలం ప్రభాకర్ 2002లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా రాంగోపాల్‌పేట్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించారు. అప్పుడు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా విజయం సాధించిన ఏకైక వ్యక్తి ప్రభాకర్. సోమవారం ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డీవీకాలనీలోని ఆయన నివాసానికి వచ్చి నివాళులు అర్పించారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావు, మాజీ రాజ్యసభ సభ్యులు హన్మంతరావు, కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపిక, మహేశ్వరి, సామల హేమ, సనత్‌నగర్, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కోట నీలిమా, ఆదం సంతోష్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కిరణ్మయి, ఆకుల రూప నాయకులు ముప్పిడి గోపాల్, గౌరపల్లి రమేష్, శ్రీహరి,, కిశోర్‌కుమార్, ఎడ్ల రాజ్‌కుమార్, గంట సుధీర్, సీకే నర్సింగ్‌రావు, దయానంద్ ప్రభాకర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

మనస్తాపంతో డెంటిస్ట్ ఆత్మహత్య

అడ్డగుట్ట: కుటుంబ కలహాల కారణంగా ఓ డెంటిస్ట్ ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడుపల్లిలోని కేసరి హనుమాన్ దేవాలయం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న దివ్య (35) కార్ఖానలోని ఓ ఆస్పత్రిలో డెంటిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తుంది. తల్లిదండ్రులు చనిపోవడంతో తన తమ్ముడితో కలసి ఉంటుంది. అయితే.. దివ్య తమ్ముడు పనికి వెళ్లడం లేదని శనివారం రాత్రి అతన్ని మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన దివ్య అదేరోజు అర్ధ రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

కంటోన్మెంట్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



పార్టీలో చేరిన వారితో శ్రీగణేష్, రామకృష్ణ

రసూల్‌పురా: గత తొమ్మిదిన్నరేళ్లలో అభివద్ధికి నోచుకుని కంటోన్మెంట్‌లో అభివద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్ పేర్కొన్నారు. ఏడో వార్డు, ఎల్ఐసీ కాలనీ, సాయిబాబా హట్స్‌కు చెందిన పలు పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా వారికి శ్రీగణేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత మంచినీటి పథకం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పకుంటున్నా తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని ఆరోపించారు. బోర్డుకు రావాల్సిన నిధులు దొడ్డిదారిన తమ ఖజానాకు మళ్లించుకున్నారని అభివృద్ధి చేయాని పార్టీకీ ఓట్లు వేస్తారా.. అభివృద్ధి చేసే బీజేపీకి ఓటు వేస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

20 నామినేషన్ల తిరస్కరణ



నామినేషన్‌ల పరిశీలన చేస్తున్న మధుకర్ నాయక్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ) నియోజకవర్గం పరిధిలో ఏడు నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా, బరిలో 11 మంది మిగిలారు. మొత్తం 18 మంది అభ్యర్థులు 33 నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం చేపట్టిన నామినేషన్ల పరిశీలనలో భాగంగా తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం ఇతరత్రా కారణాల వల్ల ఏడుగురి నామినేషన్లను తిరస్కరించారు. బీజేపీ ముగ్గురు అభ్యర్థులు నామినేషన వేయగా, బీ-ఫారమ్ సమర్పించిన శ్రీగణేశ్‌ను మా త్రమే ఆ పార్టీ అభ్యర్థిగా గుర్తించారు. మిగిలిన అ భ్యర్థులు బి. రజని, ఎం.ఎ. శ్రీనివాస్‌లను నామినేషన్లను తిరస్కరించారు. ఇక కాంగ్రెస్ నుంచి జీవీ వెన్నెల బీ-ఫారమ్ సమర్పించగా, మరో అభ్యర్థి నాతి రాగమంజుల నామినేషన్‌ను తిరస్కరించారు. వీరితో పాటు మరో నాలుగు నామినేషన్లను తిరస్కరించడంతో చివరకు 11 మంది అభ్యర్థులు మాత్రమే మిగిలారు. ఎన్. శ్రీగణేశ్ (బీజేపీ), జీవీ వెన్నెల (కాంగ్రెస్), జి.లాస్య నందిత (బీఆర్‌ఎస్), జాజుల భాస్కర్ (శ్రమజీవి పార్టీ), పైడి రాజు (ఇండియా ప్రజాబంధు పార్టీ), కరుణాకర్ బూడిద (బీఎస్పీ), పుష్పాంజలి (ఇండియన్ ప్రజా కాంగ్రెస్), గట్టు కుమార్ కార్తీక్ (ఇండిపెండెంట్), బి. కిరణ్ కుమార్ (ఇండిపెండెంట్), గజ్వేల్ భరత్ కార్తీక్(ఇండిపెండెంట్), సతీష్ కుమార్ ఎలిగందుల (ఇండిపెండెంట్) బరిలో ఉన్నారు.

సికింద్రాబాద్‌లో..

చిలకలగూడ : సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఆరుగురు అభ్యర్థులకు చెందిన పది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ భవనంలోని ఎన్నికల కార్యాలయంలో సంబంధిత అధికారులు సోమవారం నామినేషన్ల పరిశీలన చేపట్టారు. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కోసం ప్రధాన పార్టీలతోపాటు మొత్తం 33 మంది అభ్యర్థులు 57 నామినేషన్లను దాఖలు చేశారు. పరిశీలించిన అధికారులు ఆరుగురికి చెందిన సక్రమంగా లేని 10 నామినేషన్లు తిరస్కరించినట్లు తెలిపారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు నామినేషన్లు సమర్పించిన 21 మందిలో ముగ్గురు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 10 మంది ప్రపోజల్స్ లేకపోవడంతో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ వేసిన విజయ విజ్ఞాన శాంతికుమారి నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ప్రపోజల్స్‌కు చెందిన సీరియల్స్ నెంబర్స్, పార్ట్ నెంబర్స్ తప్పుగా వేసినందుకు మోరే హేమ (ఇండియన్ బిలీవర్స్ పార్టీ)తో పాటు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన మహ్మద్ అల్తాఫ్ మహ్మద్ నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 21 మంది నామినేషన్ల పరిశీలనలో వీరి ముగ్గురి నామినేషన్లను తిరస్కరించడంతో 18 మంది బరిలో ఉన్నారు.

ప్రియమైన మోదీ కాదు.. పిరమైన మోదీ అని పిలవాలి

- బీజేపీకి డిపాజిట్లు రాకుండా చేస్తాం
- మంత్రి కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

రాంగోపాల్‌పేట్: ప్రధానిని బీజేపీ నాయకులు ప్రియమైన మోదీ అని పిలుచుకుంటారని గతంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ఇప్పుడు రూ.1200 చేశారని నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పిరమైన మోదీ అని పిలుస్తే బాగుంటుందని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. సోమవారం మంత్రి తలసాని ఆధ్వర్యంలో జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ పార్టీ మతం పేరుతో మంటలు పెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు..ఆ పార్టీకి 119 సీట్లలో కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారని ఈ సారి ఆ సీట్లు కూడా లేకుండా చేసి తెలంగాణాలో ఆ పార్టీకి ఎంట్రీ లేదని మోదీకి చెబుదామని పిలుపునిచ్చారు. మోదీ పెంచిన రూ.800 కేసీఆర్ భరించి రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. అచ్చేదిన్ అచ్చేదిన్ అంటున్నారని ఆ అచ్చేదిన్ ఏమో కానీ ఇప్పుడు సచ్చేదిన్ వచ్చాయని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను రూ.50 లక్షలకు కొనుగోలు చేసేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డి ఓ దొంగ అంటూ వ్యాఖ్యానించారు. గత 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తప్పా ఆస్పత్రులు లేవని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. నగరంలో 24 గంటలు నీళ్లు అందించే కార్యక్రమం చేపట్టాలనే ఆలోచన ఉందని ఆ పైలట్ ప్రాజెక్టు సనత్‌నగర్‌లో చేపడతామన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ 365 రోజులు ప్రజల్లోనే ఉండే నాయకుడన్నారు. ప్రభుత్వం ఏ పైలట్ ప్రాజెక్టు చేపట్టినా తన నియోజకవర్గంలోనే ప్రారంభం కావాలని శ్రీనివాస్‌యాదవ్ పట్టుబడతారని కేటీఆర్ అన్నారు. తలసాని సాయి కిరణ్ యాదవ్ నియోజకవర్గంలో ప్రత్యేక యాప్ ద్వారా పోలింగ్ స్లిప్‌ల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారం, ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమాలను ఎలా చేపడుతున్నది కేటీఆర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కర్నెప్రభాకర్ కార్పొరేటర్లు కొలను లక్ష్మి, మహేశ్వరి, హేమలత పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379